చిలమత్తూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

ఎన్టీఆర్‌కు నివాళులు

◆ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు

◆ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా జరిగాయి. అన్ని ప్రాంతాల్లో టిడిపి శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు అందరూ మహానాడుకు తరలి వెళ్లడంతో ద్వితీయశ్రేణి నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలను నిర్వహిస్తుండంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పుట్టపర్తి పట్టణం సాయి ఆరామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్నతో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా, సినిమా నటుడిగా ఎన్టీఆర్ ప్రజలకు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ప్రజలే దేవుళ్ళు, సమాజమే దేవాలయం అంటూ ఆయన సేవలందించారన్నారు. ముఖ్యమంత్రిగా ఎంతో మేధావిగా ఆలోచించి తాలూకాల నుంచి మండలాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పూరిగుడిసెలు ఉండకూడదన్న ఉద్దేశంతో ఎన్టీఆర్ ఇళ్లు కట్టించారన్నారు. పేదలకు రూ.2కే కిలో బియ్యం ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడన్నారు. ఉమ్మడి జిల్లాకు హెచ్ఎల్‌సి జీవనాడి కాగా, హెచ్ఎన్ఎస్ఎస్‌ని మానస పుత్రికగా ఎన్టీఆర్ చేపట్టారన్నారు. తెలుగుజాతి ఉన్నంత కాలం ఎన్టీఆర్ సేవలు చిరస్థాయిగా ఉంటాయని తెలుగుదేశం నాయకులు తెలిపారు.

సాయిఆరామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

నిరుపయోగంగా ట్రామా కేర్..!

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పెనుకొండలో ట్రామా కేర్ భవనాన్ని మంజూరు చేసింది. భవనం పూర్తి అయినప్పటికీ అవసరమైన వైద్యులు, పరికరాలు మంజూరులో జాప్యం కారణంగా ఏళ్ల తరబడి భవనం వృథాగా ఉంది. ఫలితంగా జాతీయ రహదారి, పారిశ్రామికవాడ, రైల్వే ప్రమాదాల్లో గాయపడినవారిని బెంగళూరు, కర్నూల్, అనంతపురం తదితర ప్రాంతాలకు ఇక్కడి వైద్య సిబ్బంది రెఫర్ చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం అందక మార్గం మధ్యలోనే చాలా ప్రాణాలు వదులుతున్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు..

◆ జాతీయ రహదారిపై ప్రతిరోజూ ప్రమాదాలు

◆ వైద్యం అందక పలువురు మృత్యువాత

◆ క్షతగాత్రులను రెఫర్ చేయడం పరిపాటి

◆ ఏళ్లు గడస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం

◆ అత్యాధునిక అంబులెన్స్ ఉన్నా ఉపయోగించలేని పరిస్థితి

◆ పరికరాలు, నిపుణులు లేక నిరుపయోగం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణం చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008-09లో పెనుకొండలో రూ.65లక్షలతో ట్రామాకేర్ భవనాన్ని మంజూరు చేసింది. 2011 నాటికి భవనం పూర్తిఅయింది. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 14 ఏళ్లుగా భవనం వృథాగా ఉంది. పూర్తయిన భవనంలో ఆరేషన్ థియేటర్,ఫార్మసీ, ఐసియు, పోలీసు అవుట్‌పోస్టు అన్ని గదులు కేటాయించారు. అయినా సిబ్బంది లేమి, ఇతర సమస్యలతో దీనిని ఇప్పటికీ వినియోగంలోకి తేలేదు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు

ఉమ్మడి అనంతపురం ఎన్‌హెచ్-44 ప్రధాన జాతీయ రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండడంతో ఏదో ఒక చోట ప్రమాదాలూ జరుతున్నాయి. గడిచిన 6నెలల కాలంలో పెనుకొండ, సోమందేపల్లి,రొద్దం, గుట్టూరు ప్రాంతాల్లో 60 నుంచి 75 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అందులో 10మంది చనిపోయారు. మరో 22 మంది తీవ్రంగా గాయపడి అవయవాలు పోగొట్టుకుని జీవిస్తున్నారు. 50 మంది సల్పగాయాలతో బయటపడ్డారు.

రెఫర్‌తోనే సరి..!

ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమచికిత్స అనంతరం బెంగళూరు, కర్నూల్, అనంతపురం నగరాలకు స్థానిక వైద్యులు రెఫర్ చేయడం పరిపాటిగా మారింది. పెనుకొండ నుంచి బెంగళూరు వైపు 35 కిలోమీటర్ల దూరంలో కర్నాటక సరిహద్దు వరకు జాతీయ రహదారి, హిందూపురం, పెనుకొండ రైల్వే, పారిశ్రామికవాడలున్నాయి. పెనుకొండ వైద్యశాల పరిధిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. నెలకు 25 నుంచి 30 వరకు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు వైద్యశాలకు వస్తుంటారు. కేవలం ప్రథమ చికిత్సకే ఆస్పత్రి పరిమితమైంది. గతంలో పెనుకొండ సమీపంలో రెండు రైలు ప్రమాదాలు, ఒక బస్సు ప్రమాదాలు జరిగాయి. రెండు రైలు ప్రమాదాల్లో 50 మందిపైగా, బస్సు ప్రమాదంలో 18 మంది మృతి చెందారు. వందలాది మంది తీవ్రంగా గాయపడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

ట్రామాకేర్‌సెంటర్

వినియోగంలో లేని అంబులెన్స్

ట్రామా కేర్‌కు రూ.30 లక్షలతో అత్యాధునిక అంబులెన్స్‌ను సైతం మంజూరు చేశారు. అంబులెన్స్‌కు ఫైలెట్‌ను నియమించకపోవడంతో ఆస్పత్రి ఆవరణంలో అది నిరుపయోగంగా ఉంది. ఆరేళ్ల క్రితం ఆవాహనాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. అత్యాధునిక అంబులెన్స్ ఉన్నా అందుకు అవసరమైన నిపుణుడు లేకపోవడంతో దానిని ఉపయోగించలేని పరిస్థితి ఉంది.

పరికరాలు, నిపుణులు లేక నిరుపయోగం..

సకాలంలో కేంద్ర ప్రభుత్వ నుంచి ట్రామాకేర్ భవనానికి అవసరమైన సిబ్బంది, యంత్ర పరికరాలు మంజూరు కాలేదు. దీంతో భవనం నిరుపయోగంగా ఉంది. ట్రామాకేర్ లేకపోవడంతో తరచూ జరిగే ప్రమాదాలకు సంబంధించి సరైన వైద్యం సకాలంలో అందక క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోవాల్సివస్తోంది. పెనుకొండ నుంచి కర్నూల్, అనంతపురం, బెంగళూరుకు తరలించే క్రమంలో మార్గం మధ్యలోనే క్షతగాత్రుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ట్రామా కేర్ అందుబాటులో ఉండిఉంటే క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అంది ఉండేవి.

స్టోర్ రూంగా ట్రామాకేర్ భవనం

ఏళ్లుగడుస్తున్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా ట్రామాకేర్ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రికి వచ్చే మందులను నిల్వ చేసుకునే స్టోర్ రూంగా భవనాన్ని ఉపయోగిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనం కేవలం మందులు నిల్వ చేసుకునేందుకు వాడు కోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులు సైతం ట్రామాకేర్ విషయంలో చొరవ చూపకపోవడం గమనార్హం.

మంత్రి సవిత స్పందించాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రస్తుతం పెనుకొండ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమె ఉన్న నేపథ్యంలో ట్రామాకేర్ సెంటర్ ప్రారంభంపై చొరవచూపాలి. ఇది అందుబాటులోకి వస్తే ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. ఆదిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

బాబావలి, సిఐటియు నాయకులు, పెనుకొండ.

ఆరు విభాగాలకు ఎన్‌బికె అక్రిడిటేషన్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని ఆరు విభాగాలకు ఎన్‌బిఎ అక్రిడిటేషన్ మూడు సంవత్సరాలకు వచ్చినందని ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి బుధవారం తెలిపారు. నేసషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ మూడేళ్ల కాలపరిమితితో అరువిభాగాలకు రావడం సంతోషంగా ఉందన్నారు. తాను అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలో బోధన, బోధనేతర సిబ్బంది, వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.క్రిష్ణయ్య సహకారంతో ఇది సాధ్యం అయ్యిందన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాలను మరింత బలోపేతం చేస్తూ అగ్రగామిగా నిలపాలన్నారు.

జెఎన్‌టియు బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రెల్, మే నెలలలో నిర్వహించిన బీఫార్మసీ ఫలితాలు విడుదల అయ్యాయి. నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 19), (ఆర్ 15) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ మూడవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో బుధవారం నాడు విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం.అంకారావు తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం జెఎన్‌టియు పరీక్షల వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

రోడ్ల విస్తరణకు సహకరించండి : జేసీ

అధికారులతో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోని నాలుగు రోడ్ల విస్తరణ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు ప్రజలు ప్రజా ప్రతినిధులు వివిధ కుల సంఘాల నాయకులు సహకరించాలని. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. నాలుగు రోడ్లపై నెలకొన్న విగ్రహాలను ఆక్రమణలను ఆయన పరిశీలించారు. మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచెరువులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒక విద్యార్థికి చెయ్యి పూర్తిగా విరిగిపోయిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను గుర్తించి మార్కింగ్ కూడా పూర్తి చేశామన్నారు. ఒక పార్కు ఏర్పాటు చేసి అందులో విగ్రహాలు అన్నింటినీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ విగ్రహాలు అడ్డం లేవని రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని సూచించారు. విగ్రహాలను మరొక చోటికి తరలించకుండా ఇక్కడే ఉంచాలని కోరారు. ప్రజా అభిప్రాయాలు మేరకే త్వరలోనే చర్యలు తీసుకొని నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీవో నటరాజు, సర్వేయర్ సురేష్, మేజర్ పంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, నారాయణ, పూజారి పెద్దన్న, మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు, పిఎఫ్ ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పంపుహౌస్ వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను విడుదల చేసి, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ సత్యసాయి నీటి సరఫరా విభాగంకు సంబంధించి సుమారు రూ.8కోట్లు మున్సిపాల్టీ బకాయిలు చెల్లించినందున ఆ సంస్థ నీటి సరఫరాను నిలిపేసిందన్నారు. వెంగళమ్మ చెరువు పంప్‌హౌస్ నుంచి 35 ఏళ్లుగా నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన 4 నెలల వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. 10 నెలల పిఎఫ్ చెల్లించలేదన్నారు. వేతనాలు రాక కార్మికులు కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. పుట్టపర్తి మున్సిపాల్టీ బకాయిలు పూర్తిగా చెల్లిస్తే కార్మికులకు కొంత ఉపశమనంగా ఉంటుందన్నారు. కార్మికులపై అధికారుల వేధింపులు, అక్రమ తొలగింపులు మానుకోవాలన్నారు. లేకుంటే కార్మికుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి నీటి సరఫరా అధ్యక్షుడు నరేష్, నాయకులు మధుసూదన్, చందు, బాలు, శివ ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె బుక్‌లెట్స్‌ను ఆవిష్కరిస్తున్న ఓబులు, తదితరులు

రిలేదీక్షల్లో పాల్గొన్న కార్మికులు, నాయకులు

బకాయి వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్ల పరిష్కారం కోసం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా బుధవారం బస్సు స్టాప్ వద్ద ఆందోళన చేశారు. వారి రిలే నిరాహార దీక్షకు రైతు సంఘం నాయకుడు కేకే రాజారెడ్డి సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు అక్కులప్ప, అంజి, నరసింహులు, కదిరప్ప, గంగులప్ప, రమణమ్మ, అనిల్ పాల్గొన్నారు

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీల లెక్కింపు బుధవారం చేపట్టారు. 62 రోజులకు గాను రు.1,10,69,573లు నగదుగా వచ్చింది. బంగారు 72 గ్రాములు, వెండి 662 గ్రాములు వచ్చింది. హుండీల లెక్కింపు కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అధ్వర్యములో చేపట్టారు. ఈ కార్యక్రమంలో యన్.ప్రసాద్, ఎ.పి.జి.బ్యాంకు మేనేజర్.సి.బి.చలపతి బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎన్. రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

క్షణికావేశంలో తప్పులు చేసి కారాగారాలకు వచ్చిన తర్వాత మార్పు కనబడాలని, అలాంటి మార్పుతోనే ఆ ఖైదీల కుటుంబాలు బాగుపడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక ఉపకారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, శుద్ధ జల ప్లాంట్, జైలు గదులు, జైలు పరిసరాలు, నిత్యావసరాలు, ఫిర్యాదుల పెట్టె తదితర వాటిని పరిశీలించి ఉపకారాగారాధికారి హనుమప్పతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు రిమాండ్ ఖైదీలతో నేరుగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేనిఆర్థికంగా వెనుకబడిన రిమాండ్ ఖైదీలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు జి.ఆర్. సిద్దు, పార్వతి, సంతోషి కుమారి, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా

ప్రజాశక్తి - కదిరి టౌన్

అందరి సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, వైస్ ఛైర్‌పర్సన్ సుధారాణి, రాజశేఖరాచారి స్పష్టం చేశారు. బుధవారం మున్సిపాల్టీ కార్యాలయంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు వారికి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తమపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కె ఎస్ బహావుద్దీన్, ప్రధాన కార్యదర్శి సిరి బాబయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే సినిమా టిక్కెట్లను విక్రయించాలి

హిందూపురంలో సినిమా థియేటర్ తనిఖీలో ఆర్డీవో, రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సినిమా టికెట్లను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని ఆర్డీవో మహేష్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని రంగా థియేటర్, వరలక్ష్మి, సిద్దార్థ థియేటర్ల తనిఖీ నిర్వహించారు. అనంతరం థియేటర్లో ఉన్న మరుగుదొడ్లను పరిసరాలను వారు పరిశీలించారు. సినిమా టికెట్లు రేట్ల విషయంలో తేడా ఉండరాదని, కొత్త సినిమా రిలీజ్ అయినప్పుడు బ్లాక్ టికెట్లను విక్రయించరాదని నిర్వాహకులను ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో థియేటర్లు తప్పనిసరిగా జాగ్రత్తలు నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా సినిమా థియేటర్లో ఉండే తినుబండారాల ఆంగళ్లను పరిశీలించిన ఆయన ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని తెలిపారు. అదేవిధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారా? వసూలు చేస్తే రసీదు ఇస్తున్నారా? పార్కింగ్ ఫీజుకు ప్రభుత్వము నుండి అనుమతి ఉందా? అన్న విషయాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్ బాబు, థియేటర్ యజమానులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని సినిమా థియేటర్లను ఆర్డీవో ఆనంద్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సినిమాటోగ్రఫీమంత్రి కందుల దుర్గేష్ సినిమా హాళ్లను తనిఖీ చేసి ప్రేక్షకులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సినిమా హాళ్ల తనిఖీ చేపట్టారు. సినిమా హాల్‌లో ఫైర్ సేఫ్టీ, మరుగుదొడ్లు, సీట్లను ఆర్డీవో పరిశీలించారు. అనంతరం హాలు లోపల ఉన్న స్టాల్ లో తినుబండారాలను ఎమ్మార్పీ ధరల కంటే అధిక మొత్తంలో అమ్మకాలు చేయరాదని నిర్వాహకులను హెచ్చరించారు. అధిక రేట్లకు టికెట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో ఉన్న సినిమా థియేటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. సినిమా థియేటర్ల నిర్వహణ, వాటిలో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా థియేటర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని, థియేటర్లలో ఆహార నాణ్యత, ధరల నియంత్రణ, టికెట్ ధరలు, తినుబండారాల విక్రయం, థియేటర్ ఫిట్‌నెస్, ఫైర్, ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ తదితర అంశాలను పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. పలు థియేటర్లలో లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహశీల్దార్ మైనూద్దీన్ వివరిస్తు పట్టణంలో ఉన్నా థియేటర్లను తనిఖీలు నిర్వహించామన్నారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో రెవిన్యూ ఇన్స్ పెక్టర్ అమరేంద్రతో పాటు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న నాయకులు

విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - రొద్దం

ఓ పేద విద్యార్థి చదువులకు అయ్యే ఖర్చులకి 30వేల రూపాయిల విలువైన చెక్కును పెనుగొండ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పి వెంకటరామిరెడ్డి అందజేశారు. మండలంలోని రెడ్డిపల్లిలో టిడిపికార్యకర్త సాకలి నారాయణప్ప కొన్ని రోజుల క్రితం మృతిచెందాడు. ఆరోజు ఇచ్చిన హామీ మేరకు వెంకటరామిరెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. వెంకటరామిరెడ్డి కుమారుడు సి.గణేష్ విద్యాభ్యాసం కొరకు 60వేలు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చి తక్షణ సహాయం కింద 10వేలు అందజేశారు. దీంతో ప్రస్తుతం విద్యాభ్యాసం ప్రారంభం అవుతున్నందున బుధవారం వారి గ్రామానికి వెళ్లి పి వెంకట్రామిరెడ్డి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొరకు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని రెడ్డిపల్లి గ్రామం పంచాయతీ నాయకుల ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ కే నాగరాజు, సురప్ప, అధిరమప్ప, లింగప్ప, ఆంజనేయులు, మణీంద్ర, మారుతి, మురళి, డీలర్ చంద్ర, స్కూల్ కమిటీ చైర్మన్ మారుతి, ఈశ్వరప్ప,రామాంజనేయులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండలమీట్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపిటిసి తమ గ్రామాల పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిపి ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీడీవో దివాకర్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు బాలముని, ఆయా శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిపో ఆదాయం పెంపునకు కృషి

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమిష్టి కృషితో కదిరి డిపో ఆదాయానికి కృషి చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అన్నారు. ఇటీవల ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా డివిజన్ నూతన కమిటీని ఎన్నుకొన్నారు.దీంతో బుదవారం కదిరి డిపో నందు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు నబి రసూల్ రీజినల్ ప్రెసిడెంట్ జీవైపి రావు, రీజినల్ కార్యదర్శి రీజినల్ ట్రెజరర్ రమణప్ప, రీజియన్ నాయకులు డిపో నాయకులు డిపో ఉద్యోగులు డిఎంకు నూతన కమిటీని పరిచయం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని తలమర్లవాండ్ల పంచాయతీ ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు పోలం మాధవరెడ్డి తల్లి పోలం నారాయణమ్మ (85) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కడపల మోహనరెడ్డి బుధవారం మాధవరెడ్డి గృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులార్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్ రెడ్డి, పోరెడ్డి వెంకట రెడ్డి, గోవింద రెడ్డి, ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.P. No.15/2022 in O.S. No.68/2018

Between:

బండి నారాయణస్వామి S/o బి.నారాయణప్ప, D.N:1/1132-36-F4, అడపాలవీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...డిక్రీహోల్డరు

యెదిరి

1. కె.హస్సేన్ బాషా S/o Late రషీద్ ఖాన్,
2. కె.జిన్నావలి S/o Late రషీద్ ఖాన్,
3. కె.నాసిర్ అలి S/o Late రషీద్ ఖాన్,
4. కె.యూసుప్ ఖాన్ S/o Late రషీద్ ఖాన్,
5. సుమియా W/o బావా జాన్,
6. మున్ని W/o రిజ్వాన్,

అందరు డోర్ నెం.2-231-7, నల్లగుట్టవీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...జడ్జిమెంట్ డెబ్టార్స్

వేలము ప్రకటన

పై దావా E.P ని డిక్రీహోల్డరు తన డిక్రీ బాపతు మొత్తము వసూలు నిమిత్తమై జడ్జిమెంట్ డెబిటార్స్‌కి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు ఆస్తుల వేలము కోరినాడు. E.P ఆస్తులు పై కోర్టువారు 16/06/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పైన వేలము జరుపబడును. ఆసక్తిగల వారు వేలములో పాల్గొని వేలము పాడవచ్చునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురం జిల్లా ప్రస్తుతము శ్రీ సత్యసాయి జిల్లా, హిందూపురం రి॥డి॥ ప్రస్తుతము పుట్టపర్తి రి॥డి॥ కదిరి సబ్ రి॥డి॥కి చేరి కదిరి టౌను లేదా మున్సిపాలిటీ ఏరియాలోని పై అంతస్తు గల మిద్దె డోర్ నెంబర్లు 2/231.2.3.4 మరియు 5 యిండ్లు నల్లగుట్ట వీధిలో ఉండబడినవి

సరిహద్దులు:

తూర్పు : షేక్ మదార్ సాబ్ మిద్దె,
పడమర : హరిబుడన్ సాబ్ అంతస్తు మిద్దె,
ఉత్తరం : రోడ్డు, **దక్షిణం** : పి.సుబ్బన్న అంతస్తు మిద్దె,

కొలతలు:

ఉత్తరం-దక్షిణం : తూర్పు వైపున 34.6 లేక 10.522 మీటర్లు
ఉత్తరం-దక్షిణం : పడమర వైపున 33.0 లేక 10.065 మీటర్లు
తూర్పు-పడమర : ఉత్తరం-దక్షిణం దిశన 22.6 లేక 6.862 మీటర్లు అనగా 84-37 చదరపు గజాలు మరియు యిందులో కట్టబడిన యిల్లు 22.6 x 33.9=760 చదరపు అడుగులు గల సిమెంటుతో నిర్మించిన పైకప్పు సందు లోగిలి పాతిల్లు, తలుపులు క్రింది బాగము కట్టడాలు నీటి కుళాయి, దక్షిణము మరియు పడమర వైపు గోడలలో సగ భాగములు విద్యుత్ సర్వీసు నెం.22390.18810 మరియు 16715.లు ఈ ఆస్తి సర్వే నెంబరు 541.2 లో కలదు.

డిక్రీ హోల్డరు మతింపు రూ.13.00.000/-
కోర్టు అమీనా మతింపు రూ.18.00.000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వేలము తేది: 16/06/2025
స్థలం:కదిరి

పిడుగు రవీంద్రబాబు,
డిక్రీహోల్డరు తరుపు వకీలు, కదిరి.

విస్తారంగా వర్షాలు

పొలం దుక్కి పనుల్లో రైతులు

పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందే విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు భూములను దుక్కి దున్నే పనులకు సన్నద్ధమవుతున్నారు. అకాల వర్షాలతో పాటు వారం రోజులు ముందే ఋతుపవనాలు ప్రవేశించడం శుభపరిణామంగా రైతులు భావిస్తున్నారు. వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఉలవ, జొన్న తదితర అంతర్ పంట సాగులకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురవనున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్న నేపథ్యంలో పంటలు పెట్టడానికి రైతులు ముందుకు వస్తున్నారు. జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 2,19,950 హెక్టార్లలో ఉండగా ఇందులో 1,51,000 హెక్టార్లకు పైగా వేరుశెనగ పంట సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా భూములలో అంతర్ పంటలు సాగు చేయవచ్చని అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు 73,120 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనం పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. 40 శాతం సబ్సిడీతో విత్తన పంపిణీ చేయాలని సన్నాహంలో వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. కంది విత్తనాలు 1275 క్వింటాళు అవసరం అనే అంచనాతో అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా మండలాలకు విత్తన కాయలు చేరుతున్నాయి. వాటిని రైతు సేవా కేంద్రాలలో నిలువ చేస్తున్నారు. త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం మేరకు పంపిణీకి అధికారులు తగిన ఏర్పాట్లు చేపడుతున్నారు. మే నెలలో సాధారణ వర్షపాతం 300 నుంచి 400 మిల్లీమీటర్ల వరకు నమోదు కావాల్సి ఉండగా ఈసారి సుమారు 900 మిల్లీమీటర్లు కురిసినట్లు గణాంక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ముందస్తుగా రుతుపవనాలు ప్రవేశించడంతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే గతంలో పంటలు పెట్టి పెట్టుబడి సైతం తిరిగి రాకపోవడంతో చాలా మంది రైతులు పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయారు. ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడి కోసం ఏమి చేయాలో రైతులకు అర్థం కావడం లేదు. కుటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ 20వేల రూపాయలను మొత్తం ఒకేసారి చెల్లిస్తే పంట పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ సాయాన్ని కలిపి రాష్ట్రప్రభుత్వం దశలవారీగానే చెల్లించాలనే ఉద్దేశంతో ఉన్నట్టు తెలుస్తుంది. దశలవారీగా కాకుండా ఒకేసారి చెల్లిస్తే పంట పెట్టుబడులకు ఇబ్బంది ఉండదని రైతులు ఆశిస్తున్నారు.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ ఇవ్వాలి

వేరుశెనగ విత్తనం 90 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలి. పంటల పెట్టుబడికి అన్నదాత సుఖీభవ పథకం కింద ఒకేసారి 20వేల రూపాయల సాయం అందించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. కొన్ని బ్యాంకులలో వడ్డీ అసలు కలిపి కట్టాలని డిమాండ్ చేయడం సరికాదు. వడ్డీ మాత్రమే తీసుకొని పంట రుణాలు రెన్యువల్ చేయాలి. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం తగిన చేయూతనందించాలి.

ఈ ఎస్ వెంకటేష్,
సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

కలెక్టర్ టిఎస్. చేతన్

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించు కోవచ్చని, ప్రతి ఒక్కరూ యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో బుధవారం ఉదయం పుట్టపర్తి లోని విద్యాగిరి రోడ్డు పై పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వి. రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా దినోత్సవం పురస్కరించుకొని వచ్చే నెల జూన్ 21వ తేదీన అంతర్జాతీయ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాష్ట్ర ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని వివరించారు. యోగ సాధన ద్వారా మంచి ఆరోగ్యం పెంపొందించడం, తద్వారా ఆరోగ్యం పై ప్రజలు పెట్టే ఖర్చును తగ్గించడం తోపాటు, ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చులు తగ్గించి అభివృద్ధిని సాధించటం ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వివిధ రకాల వృత్తులు, వ్యాపారాలు చేసేవారు యోగ సాధన చేస్తే తమ తమ వృత్తి ఉద్యోగాల్లో మరింత నైపుణ్యం సాధించి మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. చిన్న వయసు నుండే యోగ సాధన చేస్తే ఏకగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి విద్యార్థులు తమ చదువుల్లో ముందంజ వేస్తారని వివరించారు. అందరికీ యోగాను చేరువ చేయాలనే మంచి లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. జూన్ 21న విశాఖలో నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రులు పాల్గొంటారని, అదేరోజు జిల్లాలో లేపాక్షి నందు కొన్ని వేలమంది యోగసనాలు ఆచరించేలా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామనిచెప్పారు. అనంతరం సుమారు 2వేల మందికి పైగా యోగ సాధకులతో కలసి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వివిధ శాఖల అధికారులు వేలాది ప్రజలు సామూహిక యోగా సాధన చేశారు. అనంతరం యోగా గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం : యోగాంధ్ర కార్యక్రమం పట్టణంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో నిర్వహించడం వల్ల ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది. బుధవారం విద్య గిరి సమీపంలో జిల్లా యంత్రాంగం యోగా కార్యక్రమం నిర్వహించింది. కలెక్టర్ టిఎస్ చేతన్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇది ప్రధాన రహదారి అయినందున ట్రాఫిక్‌ను ఆర్టీసి డిపో ముందర వెళ్లే రహదారి వైపు మళ్ళించారు. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు అన్ని అదే దారిలో వెళ్లాల్సి వచ్చింది. ఆ కార్యక్రమం జరిగే వరకు ఆ రహదారిలో పాదచారులు సైతం వెళ్లడానికి వీలు లేకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహనాలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో ఎన్నో అనువైన ప్రదేశాలు ఉన్నప్పటికీ ప్రధాన రహదారిపైనే ఈ కార్యక్రమం ఎందుకు చేపట్టారన్న విమర్శలు పౌరుల నుంచి వెలువడ్డాయి. ఈ యోగా కార్యక్రమంలో మొత్తం జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల కేంద్రంలో బీసీ కాలనీకి చెందిన సుధాకర్(38) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుధాకర్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరివేసుకొని మృతిచెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు యువతులు అదృశ్యం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణానికి చెందిన ఇద్దరమ్మాయిలు అదృశ్యం అయినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని కమాన్ స్ట్రీట్ కి చెందిన షేక్ రియాజ్, నూర్జహాన్ దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. వారిలో తహసీన్, ఫిర్దోస్ పెద్ద వారు. మంగళవారం వీరిద్దరిని ఇంటిలో వదిలి రియాజ్, ఆయన భార్య, చిన్న కూతురుతో కలసి హిందూపురానికి శుభకార్యానికి వెళ్లారు. శుభకార్యం ముగించుకుని రాత్రికి తిరిగి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటిలో ఉన్న కూతుర్లిద్దరూ కనబడలేదు. కూతుర్ల కోసం భార్యాభర్తలిద్దరూ బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెతికారు. ఇద్దరి ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఇంట్లో పనులు చేయలేదని మందలించడంతో ఇలా పారిపోయి ఉంటారని తల్లిదండ్రులు చెప్పినట్లు ఆయన వివరించారు. ఆ ఇద్దరు అమ్మాయిలు ఎక్కడైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలకేంద్రంలోని శివారులో నాలుగు మోరీల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని పొడరాళ్లపల్లికి చెందిన సాయి, తిమ్మనాయనిపాలెంకు చెందిన చింటూ ద్విచక్రవాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కిందికి పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిద్దరిని 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు

పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

అధికారితో మాట్లాడుతున్న రైతులు

జాతీయ రహదారి పనులకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చిన తరువాతనే పనులు చేయాలని బాధిత రైతులు డిమాండ్ చశారు. రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న భూమి కోల్పోయిన రైతులు మూడవరోజు కూడా పనులు చేయకుండా అడ్డుకున్నారు.కాంట్రాక్టర్ సమాచారం మేరకు నేషనల్ హైవే అధికారులు ఎన్ హెచ్ డి ఈ గిడ్డయ్య ఘటనాస్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులకు అందాల్సిన నష్టపరిహారం గురించి సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అయితే ఆయన మాటలను నమ్మని రైతులు సబ్ రిజిస్ట్రేషన్ ప్రకారం తమకు పరిహారం చెల్లించే వరకు పనులు చేయనీయమని తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో సోమల ప్రకాష్ నాయుడు సనత్ కుమార్ విశ్వనాథ్ ప్రభాకర్ నాయుడు టీవీ రమణ, రాగి నాయుడు, హనుమంతు, మహిళా రైతులు హేమలత, రమణమ్మ, షాను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి

పావగడ : స్థానిక సంస్థల్లోని వివిధ విభాగాల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీనియర్ హెల్త్ ఇన్ స్పెక్టర్ షంషుద్దీన్ డిమాండ్ చేశారు. పౌర కార్మికుల డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలోని పౌర సంస్థల సంఘం చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తాలూకా పౌర కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న అన్ని సౌకర్యాలను పౌర కార్మికులకు కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా నియమితులైన పౌర కార్మికులకు స్థానిక సంస్థల నిధి నుండి వేతనాలు చెల్లించే విధానాన్ని రద్దు చేసి, ఎస్ఎఫ్‌సి ఫండ్ నుండి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫీసర్ జాఫర్ షరీఫ్, కమ్యూనిటీ ఆర్గనైజింగ్ అధికారిణి భాగ్యమ్మ, మేనేజర్ సంతోష్ కుమార్, రెవెన్యూ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి

కొత్తచెరువు : కొత్త చెరువులోనే ఎస్సీ కాలనీ లోనే ఆర్టీసీ పాఠశాల ముందర విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ స్తంభం లేకపోవటంతో మెయిన్ లైన్ వైర్లు వేప చెట్టుకు చుట్టి విద్యుత్తుని ఇళ్లకు సప్లై చేస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. గతంలో ఇక్కడ విద్యుత్తు స్తంభం ఉండేదని అది శిథిలావస్థకు చేరుకుని పడిపోయిందన్నారు. అప్పటినుంచి అధికారులు ఇక్కడ స్తంభం ఏర్పాటు చేయలేదన్నారు. సమస్యను నెల రోజులుగా విద్యుత్ అధికారులకు చెబుతున్న వారు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు, దెమికేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా నోడల్ అధికారి కళాధర్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా 2023-25 జనన మరణాల రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో జననాల తగ్గుదలపై కారణాలు అడిగి తెలుసుకొని, ఆసుపత్రిలో జననాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణుల వివరాల నమోదు, పిఎంఎంవైవి, అభా ఐడీస్, పిహెచ్ఆర్ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఒ వీరమ్మ, వైద్యాధికారి తేజస్విని, సిహెచ్ఒ జయచంద్రకుమార్, పిఎన్ఎమ్ లీలావతి, డిజిటల్ అసిస్టెంట్ అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: పురపాలక సంఘ కార్యాలయంలోని జనన మరణ విభాగాన్ని జిల్లా గణాంకాల అధికారి కళాధర్ బుధవారం తనిఖీ చేశారు. 2022 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి మార్చి 31 2025 వరకు కార్యాలయంలో జనన, మరణ నమోదు చేసిన జారీ చేసిన ధవీకరణ పత్రాలపై ఆరా తీశారు. పురపాలక సంఘ పరిధిలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లలో జననాలపై సమగ్రంగా వివరాలు తీసుకుని నిబంధనల మేరకు జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా ప్రజా ఆరోగ్య అధికారిణి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఎన్టీఆర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో రొద్దం టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

నందమూరి తారక రామారావు తెలుగుజాతి అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఆమె బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ఎస్పీ తో పాటు ఏవో సుజాత, సూపర్డెంట్ సరస్వతి, ఎస్బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, అర్ ఐ లు వలి, మహేష్, సిసి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలను మండల టిడిపి నాయకులు కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పాలు బెడ్లు పంపిణీ చేశారు ఎంపీడీవో కార్యాలయం నందు అధికారికంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు అధికారులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకష్ణ చౌదరి నాయకులు సోమశేఖర్ వేణు జయరాం అజ్మతుల్లా సుబ్బారెడ్డి భాస్కర్ రెడ్డి ఉత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పెనుకొండ :మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రభుత్వ అధికారులు ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్ ఆర్ ఐ భాస్కర్ రెడ్డి ఆర్డిఓ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండల అభివద్ధి కార్యాలయంలో ఎంపీడీవో నరేష్ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని అన్ని సచివాలయాలలో మాజీ ముఖ్యమంత్రి చిత్రపటానికి సచివాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సీనియర్ టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు నేతత్వంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్ పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ నాయకులు నారాయణస్వామి వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ఎఎన్టీఆర్ జయంతిని ధర్మవరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నందు ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పుట్టపర్తి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు జాతికి చేసిన సేవలు మరువలేనివని పుట్టపర్తి తహశీల్దార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: బస్టాండ్ కూడలిలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, కెపి అంజనప్ప నాయుడు,దండే రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల కేంద్రంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలోఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తలుపుల : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ జయంతిని తలుపుల మూడు రోడ్ల కూడలిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీ జయచంద్ర, శ్రీనివాసులు, మేడా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని చిలమత్తూరు మండల కేంద్రంలో బుధవారం టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోడికొండ బాలాజీ, లక్ష్మీనారాయణ యాదవ్, మల్లిరెడ్డి, నందీశప్ప తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : ఎన్టీఆర్ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వచించారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రం లోని స్థానిక బస్టాండ్ వద్ద చావిడిలో మండల నాయకులు అయన చిత్ర పటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విదంగా మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జయంతిని వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు మాధవ నాయుడు, కన్వీనర్ నరహరి, నాయకులు చిన్నప్పయ్య,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : నల్లమాడలోఎన్టీఆర్ జయంతిని ఆపార్టీ నాయకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఆవరణలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కే లక్ష్మన్న సర్పంచి భారతి చాంప్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు,

పరిగి : ఎన్టీఆర్ జయంతినిపరిగి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యమంలో సర్పంచి బాలాజీ, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ,మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యమంలో పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గంలో ఎన్టీఆర్ జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుడిబండ : మండల పరిధిలోని మద్దనకుంట గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాసప్ప కుమార్,దర్శన్, హనుమంతరాయప్ప నరసింహమూర్తి,శివ, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిన్ని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తారకరామ సర్కిల్ కు చేరుకొని అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, సీనియర్ నాయకులు నాగరాజు పాల్గొన్నారు. అదే విధంగా హిందూపురం ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.